

రూ.100 కోట్లతో వ్యవసాయ
## కళాశాల ఏర్పాటు

- గురుకుల విద్యార్థులకు 75 శాతం రిజర్వేషన్
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి

7



ధూళిమిట్టలో భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సాదాబైనామాకు
# 44వేల మంది దరఖాస్తులు

- భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి : కలెక్టర్ మనుచౌదరి

ధూళిమిట్ట/మద్దూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సుమారు 44 వేల మంది సాదాబైనామాకు దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి అర్హత ఉంటే పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తామని కలెక్టర్ మను చౌదరి అన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భూభారతి చట్టంపై తహసీల్దార్ రహీం అధ్యక్షతన, ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతు వేదికలో వేర్వేరుగా జరిగిన అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. రైతుల భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక మంది మేధావులతో, న్యాయ నిపుణులతో సమగ్రంగా చర్చించి దాదాపు 18 రాష్ట్రాల్లో ఉన్న భూచట్టాలను పరిశీలించి అంబేడ్కర్ జయంతి రోజున భూభారతి నియమ నిబంధనలను తీసుకొచ్చిందని చెప్పారు. గతంలో ధరణిలో జరిగిన పొరపాట్లను, రైతుల భూసమస్యలను సరిచేయడానికి అధికారులకు తగిన అధికారాలు లేవని, ఇప్పుడు భూభారతిలో తహసీల్దార్ స్థాయిలో, ఆర్డీవో స్థాయిలో, కలెక్టర్ స్థాయిలో పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి సమస్యకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటుతో పాటు నిర్ణీత సమయంలో జవాబు లభిస్తుందన్నారు. వారసత్వంగా వచ్చే భూముల్లో లీగల్‌గా నోటీసులు ఇచ్చి నిర్ధారిత సమయంలో పరిష్కరించుకునే వీలుందన్నారు. మనిషికి ఆధార్‌కార్డ్ లాగా ప్రతి భూమికీ భూధార్ కార్డ్ కేటాయిస్తామని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ భూభారతి చట్టంలో ప్రతీ సెక్షన్ గురించి రైతులకు సవివరంగా వివరించారు. అనంతరం కలెక్టర్ ధూళిమిట్ట మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి త్వరలోనే ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌గా మార్చి అన్ని సౌకర్యాలను కల్పించి పునఃప్రారంభిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ మధుసూధన్, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జీవన్‌రెడ్డి, డీఏవో రాధిక, ఎంపీడీవో రాంమోహన్, మాజీ జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, పలువురు పాల్గొన్నారు.

# బీమా ఏదీ ధీమా?

- నిరీక్షణలో ఇందిరా మహిళా శక్తి సభ్యులు
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10లక్షలు, అంగవైకల్యానికి రూ. 5 లక్షలు..
- జిల్లాలో రుణ బీమా కింద 198 మంది, ప్రమాదాల్లో 16 మంది ఆకస్మిక మరణం
- నేటివరకు 57 మందికి రుణబీమా, 10 మందికి ప్రమాద బీమా చెల్లింపు

**మహిళా గ్రూపు సభ్యులకు అందించే రుణ, ప్రమాద బీమా కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లావ్యాప్తంగా వందలాది మందికి రుణబీమా, పదుల సంఖ్యలో ప్రమాద బీమా అందక పోవడంతో ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి**



సిద్దిపేటలో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25: మహిళలు ఆర్థికంగా రాణించాలన్న లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ పథకంలో భాగంగా రుణాలు, గ్రూపుసభ్యులకు బీమా అందించేందుకు ప్రభుత్వం రుణ, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించింది. అందుకుగాను మహిళా సంఘంలోని ప్రతీ సభ్యురాలికి సంబంధించిన బీమా ప్రిమియాన్ని ప్రభుత్వం పూర్తిగా భరిస్తుంది. ఈ పథకానికి గతేడాది మార్చి 14 తరువాత సభ్యత్వం పొందిన వారు, రుణాలు తీసుకున్న గ్రూపు సభ్యులు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే కొన్ని నెలలుగా ప్రమాదవశాత్తు మరణించిన సభ్యులకు రావాల్సిన బీమా డబ్బు అందకపోవడం, బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాన్ని ప్రభుత్వం చెల్లించకపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 147 మంది మృతుల కుటుంబసభ్యులు ప్రభుత్వం అందించే బీమా డబ్బు కోసం ఎదురుచూస్తున్నారు.

### సభ్యులకు వరంగా...

మహిళా సంఘంలోని సభ్యులకు ఇందిరా మహిళాశక్తి మిషన్‌లో భాగంగా రుణ, ప్రమాద బీమా పథకాలను ప్రభుత్వం వరంగా కల్పించింది. రుణ, బీమా కింద బ్యాంకు లింకేజీల ద్వారా మహిళా సంఘానికి వచ్చిన రుణంలో వాటాల కింద సభ్యులు రుణం తీసుకున్న తరువాత మరణిస్తే ఆ రుణ బకాయి మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించనున్నది. ప్రమాద బీమాలో అకస్మాత్తుగా సభ్యులు మరణిస్తే మరణ ధృవీకరణ, మహిళా సంఘం తీర్మానంతో పాటు ఇతర పత్రాలను అందిస్తే బీమా కింద రూ.10 లక్షలను కుటుంబసభ్యులకు (నామినీ) అందించనున్నది. ప్రమా దం జరిగి అంగవైకల్యానికి గురైతే రూ. 5 లక్షలను అందిస్తారు. ఎవరైనా సభ్యురాలు రుణం తీసుకొని ఆ తర్వాత మరణిస్తే ఆ డబ్బును తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుంది.

| సెర్ప్ సంఘాలు | సభ్యులు |
|---|---|
| 18,315 | 1,94,139 |

మెప్మా కింద సంఘాల వివరాలు

| మున్సిపాలిటీ | సంఘాలు |
|---|---|
| సిద్దిపేటలో | 2199 |
| గజ్వేల్‌లో | 649 |
| దుబ్బాకలో | 586 |
| హుస్నాబాద్‌లో | 503 |
| చేర్యాలలో | 306 |
| మొత్తంగా | 4,243 |

### కొన్ని నెలలుగా ఎదురుచూపులే..

జిల్లాలో వివిధ కారణలతో గతేడాది మార్చి నుంచి నేటి వరకు మొత్తంగా 214 మంది మహిళా సంఘాలకు చెందిన సభ్యులు మరణించారు.

సెర్ప్, మెప్మా సంఘాలకు కలిపి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.1,039.82 కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం స్త్రీనిధి రుణాలను అందజేసింది. వీటిలో సెర్ప్‌లోని 18,315 మహిళా సంఘాలకు రూ.905.15 కోట్లు, ఐదు మున్సిపాలిటీల్లోని మెప్మాలో 4,243 మహిళా సంఘాలకు రూ.134.67 కోట్లు రుణాలను సంఘాలకు అందించింది.

రుణ బీమా కింద 198 మందిలో 176 మంది సెర్ప్ సభ్యులు, 22 మంది మెప్మా సభ్యులు ఉండగా, ప్రమాద బీమా కింద 16 మందిలో 12 మంది సెర్ప్ సభ్యులు, నలుగురు మెప్మా సభ్యులు మరణించారు.

రుణ బీమా కింద మరణించిన 176 మంది సెర్ప్ సభ్యులకు గానూ 57 మందికి మాత్రమే రుణానికి సంబంధించిన బకాయిలను బ్యాంకులకు చెల్లించగా, మున్సిపాలిటీలకు చెందిన 22 మంది మెప్మా సభ్యుల కుటుంబాలకు ఒక్కరికి కూడా రుణ బకాయిలను చెల్లించలేదు.

ప్రమాద బీమాకు సంబంధించి 16 మంది సెర్ప్ సభ్యుల్లో 12 మందికి గాను 8 మందికి రూ.10 లక్షల చొప్పున చెల్లించారు. నలుగురివి పెండింగ్‌లో ఉంచారు. మెప్మాకు సంబంధించి నలుగురు

మిగతా 8లో..

# కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యం

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట వంటి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. యాసంగి వడ్లు క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర రావాల్సి ఉండగా దళారులకు రూ.2వేలు, రూ.2,100 అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు రాష్ట్రంలో ఉన్నది రైతు కంటక ప్రభుత్వమన్నారు. రుణ మాఫీ చేస్తామని చెప్పి సగం మందికి చేయలేదన్నారు. రైతు బంధును వానకాలంలో ఎగగొట్టి యాసంగిలో రెండు మూడు ఎకరాలకే ఇచ్చి చేతులెత్తేసారని ఆరోపించారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకి రూ.20 వేల ఇన్‌పుట్ సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ల ద్వారా తక్షణమే నివేదిక తెప్పించుకుని రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. పాలమాకుల కేంద్రంలో వడ్లు కొని వారం అయినా ఇంకా రైతులకి డబ్బు ఇవ్వలేదన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏమో 48 గంటల్లో రైతులు అమ్మిన ధాన్యానికి డబ్బులను అకౌంట్‌లో వేస్తున్నామని హైదరాబాద్‌లో చెప్తారు. కానీ ఇక్కడ మాత్రం డబ్బు అకౌంట్‌లో పడడం లేదని స్వయంగా రైతులే చెప్తున్నారు అని తెలిపారు. గన్నీ బ్యాగులు నాణ్యత లేకపోవడం వల్ల హమాలీలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారిని ఆదుకునేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, ఐకేపీ డీపీఎం వాసుదేవ్, ఐకేపీ సిబ్బంది లింగం తదితరులు ఉన్నారు.



నంగునూరు మండలం పాలమాకుల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## సాత్వికకు సాయం

- రూ.2 లక్షల చెక్కును అందించిన హరీశ్‌రావు



రూ.2 లక్షల చెక్‌ను సాత్వికకు అందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటకల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న సిద్దిపేట మెట్రో గార్డెన్‌లో నిర్వహించిన భద్రంగా ఉండండి.. భవిష్యత్‌లో ఎదగాలి అనే కార్యక్రమంలో భాగంగా సాత్విక అనే విద్యార్థిని తన తండ్రి చనిపోయారని, తల్లి కష్టపడి పెంచుతుందని, తనను తానూ ఇబ్బంది పెడుతున్నాని కన్నీళ్లు పెట్టుకుంది. అదే సభలో ఉన్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు భావోద్వేగానికి గురయ్యారు. సాత్వికను దగ్గరకు తీసుకుని తానూ అండగా ఉంటానని ఆత్మీయంగా భరోసానిచ్చారు. ఈ మీటింగ్ జరిగే సమయంలోనే హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త తిరుమల్ రెడ్డి చిన్నారి కుటుంబానికి 2లక్షలు సహాయం చేస్తా అని హరీష్ రావుకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో టిఫిన్‌కి రావాలని చిన్నారి సాత్వికను, సాత్విక తల్లిని హరీష్ రావు ఫోన్‌లో ఆహ్వానించారు. శుక్రవారం కలిసిన వారితో మాట్లాడి పరిస్థితి అడిగి తెల్సుకున్నారు. కలిసి టిఫిన్ చేశారు. అనంతరం 2 లక్షల చెక్‌ను హరీశ్ రావు వారికి అందించారు. మంచిగా చదువుకొని అమ్మను మంచిగా చూసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఏ ఇబ్బంది వచ్చిన తానూ అండగా ఉంటానని హరీశ్ రావు భరోసానిచ్చారు.

**బీఆర్ఎస్ రజతోత్సవం.. తెలంగాణ పండుగ**

- టెలీకాన్ఫరెన్స్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

7




ఇటీవల కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం సిద్దిపేటలో ముస్లింలు నిరసన చేపట్టారు. నమాజ్ తర్వాత జిల్లా కేంద్రంలోని పలు మసీదుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. దాడిలో మృతి చెందిన వారికి రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఉగ్రవాదానికి మతం లేదని సిద్దిపేట ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు.

- సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

## అమ్మో..చిరుత

- వడ్డెపల్లిలో మళ్లీ కలకలం
- ఇటీవల కుక్కలపై దాడి

రాయపోల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామస్థులకు చిరుతపులి భయం వెంటాడుతూనే ఉంది. రెండేళ్ల క్రితం లేగదూడలను లాక్కెల్లి చంపి తిన్నది. ఆరునెలల క్రితం రెండు పిల్లలతో కలిసి గ్రామస్థులకు కనిపించిం ది. నెల క్రితం తిమ్మక్కపల్లిలో సంచరిస్తున్న పులిని స్థానిక రైతు లు గమనించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారు లు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ పులి జాడ దొరకలేదు.

### రెండు కుక్కలపై దాడి

వడ్డెపల్లికి చెందిన వేముల రాజమల్లయ్య పొలాన్ని యాదగిరి అనే వ్యక్తి కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. పొలం వద్ద కోతుల బారి నుంచి రక్షణకు యాదగిరి రెండు కుక్కలను గురువారం రాత్రి కట్టేసి వెళ్లిపోయాడు. ఉదయం పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా రెండు కుక్కలను చిరుతపులి చంపేసి తిన్నది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో) సందీప్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను పరిశీలించారు. చిరుత సంచరిస్తున్నందున చుట్టుపక్కల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలను పొలాల వద్దకు తీసుకెళ్లకూడదని హెచ్చరించారు.

## ఈదురుగాలులతో భారీ వర్షం

మిరుదొడ్డి/తొగుట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, పెద్ద గుండవెల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి దుమారానికి తిమ్మాపూర్ యూనియన్ బ్యాంకు ఎదుట రేకులు కొట్టుకుని పోయాయి. తొగుట మండలంలో ఉరుములు పిడుగులతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా రైతులు పడరాని పాట్లు పడ్డారు. గుడికందులలో తాటిచెట్టుపై పిడుగు పడడంతో చెట్టు పూర్తిగా దగ్ధమైంది. వర్ధరాజ్‌పల్లిలో రేపాక పరుశరాముకు చెందిన రెండు పాడి గేదెలు పిడుగుపాటుకు మృతిచెందాయి. వాటి విలువ రూ.2.50లక్షలు వరకు ఉంటాయని బాధిత రైతు తెలిపాడు.



గుడికందులలో పిడుగుపడి దగ్ధమవుతున్న తాటిచెట్టు



తిమ్మాపూర్‌లో ధ్వంసమైన రేకులు



వర్ధరాజ్‌పల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన గేదెలు

సృజనాత్మక, స్వతంత్ర ఆలోచనలే
కొత్త వ్యాపార
## ఆవిష్కరణలకు నాంది

- స్టార్టప్ మెంటర్ అక్షయ్ దేశ్‌పాండే

7

## క్లాస్‌రూమే.. క్యాన్వాస్

- ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న టీచర్

7

చేతిపంపు మెకానిక్‌లను
## పట్టించుకునే వారేరీ?

- చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు..
- సకాలంలో అందక అవస్థలు

7





## నాడు మోడు.. నేడు నీడ

శిశిరంలో ఆకులు రాలిన చెట్లు వసంతంలో చిగురిస్తాయి అన్నట్లుగా హుస్నాబాద్‌లోని అక్కన్నపేట రోడ్డు అమరవీరుల స్థూపం వద్ద మొన్నటి వరకు మోడుగా మారిన రావి చెట్టు నేడు వచ్చని ఆకులతో పది మందికి నీడ నిస్తుంది. ఇదే రోడ్డు పక్కన ఆకులు లేక ఎండినట్లుగా దర్శనమిచ్చిన చెట్టు నేడు ఎర్రపూలతో బాటసారులకు స్వాగతం పలుకుతున్నాయి.

- హుస్నాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

## ఏడుపాయల్లో నీట మునిగి ఒకరి మృతి



వీరస్వామి మృతదేహం

పాపన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బంధువుల విందు కోసం వచ్చిన వచ్చిన ఒకరు శుక్రవారం ఏడుపాయల్లో నీట మునిగి చనిపోయారు. వివరాల్లోకి వెళితే.. నాగర్ కర్నూలు జిల్లాలోని పెద్ద కొత్తపల్లి మండల పరిధి మరికెల్ గ్రామానికి చెందిన వీరస్వామి(40) తన భార్య మల్లేశ్వరి, ముగ్గురు కుమార్తెలు, బాబుతో కలసి తన బంధువుల విందులో పాల్గొనడానికి శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు స్నానం చేసేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మృతుడు పెయింటర్‌గా పనిచేసే వాడని కుటుంబీకులు తెలిపారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరి మృతి



బాల్‌రాజ్(ఫైల్)



నవీన్(ఫైల్)

నర్సాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రహదారి రుస్తుంపేట గేటు సమీపంలో గురువారం రాత్రి రెండుబైకులు ఢీకొనగా ఇద్దరు మృతిచెందారు. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌కు చెందిన బాల్‌రాజ్(32) బైక్‌పై నర్సాపూర్ వైపు నుంచి చౌటకూర్‌కు వెళ్తున్నాడు. నర్సాపూర్‌కు చెందిన చింతకుంట నవీన్(26) దౌల్తాబాద్ వైపు నుంచి నర్సాపూర్‌కు బైక్‌పై అతివేగంగా వస్తున్నాడు. ఈ క్రమంలో నవీన్ బైక్‌తో, బాల్‌రాజ్ బైకును ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, సమీపంలోని వారు అంబులెన్సు ద్వారా నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే, బాల్‌రాజ్ ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా అక్కడ చనిపోయారు.. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాల్‌రాజ్‌కు భార్యతో పాటు 13 ఏళ్ల కూతురు, పదేళ్ల కుమారుడు ఉండగా, నవీన్‌కు పెళ్లి కాలేదని ఎస్‌ఐ తెలిపారు.

# వేర్వేరు చోట్ల ఐదుగురి ఆత్మహత్య

- కుటుంబకలహాలతో ఉరేసుకున్న ఇద్దరు
- పాపన్నపేటలో గుర్తుతెలియని వ్యక్తి
- బుదేరాలో చెట్టుకు ఉరేసుకుని ఒకరు
- గడ్డిమందు తాగి తూప్రాన్‌లో యువకుడు

రామాయంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలవాల రాజు(35) శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు వదిలాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబీకులకు విషయాన్ని తెలుపగా.. అక్కడి చేరుకున్న భార్య లక్ష్మి కన్నీరుమున్నీరైంది. ఈ మేరకు ఎస్‌ఐ బాలరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### అల్వాలలో యువకుడు..

మిరుదొడ్డి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబకలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ పర్షరాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొగాకు స్వామి(31) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల రూ.11 లక్షలతో ఒక వాహనాన్ని కొనుగోలు చేయగా, ఈ విషయంలో స్వామికి, అతడి భార్యకు మధ్య తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వామి ఉరేసుకున్నాడు. స్వామికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గుర్తుతెలియని వ్యక్తి..

పాపపన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేటలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. పాపన్నపేట శివారులో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఉండటాన్ని శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి వయస్సు 30-40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై కుంకుమ రంగు షర్టు, నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. పది-పదిహేను రోజుల క్రితం ఉరేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

### ఇంట్లో నుంచి వెళ్లి.. చెట్టుకు ఉరేసుకుని

మునిపల్లి, ఏప్రిల్ 25: (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్న ఘటన మునిపల్లి మండలం బుధేరా గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుదెరా గ్రామానికి చెందిన కొల్కొంద శ్రీనివాస్(44) మూడు రోజులు క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు శ్రీనివాస్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఉన్న శ్రీనివాస్‌ను అటుగా వెళ్లిన గొర్రెకాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ భార్య స్వప్నకు సమాచారం అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ..

మనోహరాబాద్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించ లేక గడ్డిమందు తాగి వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గజ్జెల బాబు(32)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాబు ఆటో నడుపుతుంటాడు. భార్య ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆసుపత్రి కోసం అప్పులు చేశాడు. అప్పులు పెరగిపోవడం, కుటుంబం గడవక ఏమీ చేయాలో తెలియక ఈనెల 18న గడ్డి మందు తాగడు. కుటుంబసభ్యులు బాబును తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## బీఆర్ఎస్ రజతోత్సవం..
# తెలంగాణ పండుగ

- 25 ఏళ్ల వేడుకల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు (ఫైల్)

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25: బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ వేడుకలు, యావత్ తెలంగాణకు పండుగ లాంటిదని, ఈ సభ తెలంగాణలోని ప్రతి ఒక్కరికి విజయోత్సవం కావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులతో శుక్రవారం హరీశ్‌రావు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ కాలం పాటు అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రం సాధించినా, పదేళ్లలో తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపినా అది కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమైందన్నారు. అంతటి ఘనచరిత్ర కలిగిన పార్టీ 25 ఏళ్ల పండుగలో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. వాహనాల ఏర్పాటు, నీటి వసతి, భోజనం సహా ఏ విషయంలోనూ కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సాయంత్రం 5 గంటల్లోపు సభాస్థలికి వచ్చేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అందరూ ఏవిధంగా అయితే సభకు వస్తున్నారో, అంతే సురక్షితంగా ఇళ్లు చేరేలా ఇన్‌చార్జీలు, నాయకులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. సమన్వయంతో ఉంటూ, క్రమశిక్షణ పాటిస్తూ బహిరంగ సభను సక్సెస్ చేసి ఉమ్మడి మెదక్ జిల్లా సత్తా చాటాలన్నారు.

### బీఆర్ఎస్ సభకు 26 కారుల్లో..



గులాబీ రంగులోని అంబాసిడర్ కార్లు

రామచంద్రాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ఎల్కతుర్తి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్ కుమారుడు బీఆర్ఎస్ యువ నాయకుడు సాయిచరణ్‌గౌడ్ 26 కార్లలో కార్యకర్తలను తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేశాడు. మొత్తం 26 అంబాసిడర్ కార్లను అద్దెకు తీసుకుని, గులాబీమయంగా అలంకరించారు. శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ప్రారంభిస్తామని సాయిచరణ్ గౌడ్ తెలిపారు.

### అర్ధరాత్రి ఆగమైన తల్లీకుమారులు

- బంధువుల ఇంటి వద్దకు చేర్చిన పోలీసులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ తల్లి, ఇద్దరు కుమారులు అర్ధరాత్రి బస్సులో ఓ చోట దిగబోయి మరోచోట దిగడంతో ఎటు వెళ్లలేని పరిస్థితుల్లో పోలీసులు బంధువుల ఇంటికి చేర్చారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరికి చెందిన దుర్గభవాని తన ఇద్దరు కుమారులతో గురువారం హైదరాబాద్‌కు వచ్చి ఓపెన్ ఇంటర్ పరీక్ష రాసింది. అనంతరం గజ్వేల్‌లో బంధువుల ఇంటి వద్దకు వెళ్దామని రాత్రి జేబీఎస్‌లో బస్సు ఎక్కారు. వారు ప్రజ్ఞాపూర్‌లో దిగాల్సి ఉండగా కుకునూరుపల్లిలో దిగారు. రాత్రి 1:00 సమయంలో దుర్గభవానికి ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియక డయల్ 100కి కాల్ చేసి వివరాలను తెలిపింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ జగదీశ్వర్, కానిస్టేబుళ్లు విఠల్, రామచంద్రరెడ్డి హుటాహుటిన బాధితుల వద్దకు వచ్చి గజ్వేల్‌లోని బంధువుల ఇంటి వద్దకు చేర్చారు.





తరగతి గది గోడపై శ్రీనివాస్ వేసిన మహనీయుల చిత్రాలు, రాసిన వారి వివరాలు, మరో గోడపై వేసిన చిత్రం

# క్లాస్‌రూమే.. క్యాన్వాస్

## ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న టీచర్


నారాయణఖేడ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి పెయిటింగ్. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన అందె శ్రీనివాస్ బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే చిత్రకారుడిగా మెప్పు పొందుతున్నారు. తన కళ పలువురికి ఉపయోగంగా ఉండాలనే ఆలోచనతో తాను పని చేసే పాఠశాల తరగతి గదుల గోడలనే కాన్వాస్‌గా మార్చుకున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు.

**పాఠశాల గోడలపై ఎన్నో..**

శ్రీనివాస్ పెన్సిల్ స్కెచ్, ఆయిల్ పెయింటింగ్, చాక్ ఆర్ట్, సాండ్ ఆర్ట్, తంజావూరు పెయింటింగ్స్ త్రీడీ తంజావూరు పెయింటింగ్స్ త్రీడీ పేయింటింగ్స్ సైన్ బోర్డ్స్‌పై చిత్రాలు వేస్తారు. ఇప్పటివరకు నారాయణఖేడ్ మండలం ర్యాలమడుగు, పంచగామ, మాణిక్‌నాయక్, తండా, పగిడిపల్లి, నర్సాపూర్, కల్హేర్ మండలం క్రిష్టాపూర్, సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాం పాఠశాలల్లో తెలుగు అక్షర మాలతో పాటు అచ్చులు, హల్లులు, ఏబీసీడీలు గుణింతాలు, అంకెలు, వివిధ రకాల ఆకారాలు, జాతీయ చిహ్నాలు, పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే మెను వివరాలు, వర్ణమాలలు, సూక్తులు, దేశ నాయకుల సందేశాలు, తులామానం, కాలమానం, ప్రధాన సంఖ్యలు, రోమన్



శ్రీనివాస్ గీసిన అల్ఫాబెట్స్


శ్రీనివాస్ తీర్చిదిద్దిన ఆదిశంకరాచార్య త్రీడీ పెయిటింగ్

సంజ్ఞలు, హిందు, అరబిక్ సంజ్ఞలు, స్థానక పట్టికలు, గణిత చిహ్నాలు, రంగులు, కూరగాయలు, నృత్యం, శరీర భాగాల వివరాల, ఇంగ్లిష్ నెలలు, వర్షం చిత్రాలను చక్కగా వేయడంతో, తరగతి గదులు రంగుల హరవిల్లు, ఇంద్రధనుస్సు మాదిరిగా మారాయి. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలను చక్కగా నేర్చుకోగల్గుతున్నారు. టీఎల్ఎంకు సంబంధించిన చిత్రాలను కూడా ఆయా పాఠశాల తరగతి గదులలో చిత్రీకరించడంతో, విద్యార్థులు ఆ చిత్రాల ద్వారా సులభంగా నేర్చుకుని, మర్చిపోకుండా ఉండగల్గుతున్నారు.

**సొంత ఖర్చుతో..**

శ్రీనివాస్ సబ్జెక్ట్ బయోసైన్స్ అయినప్పటికీ, ప్రవృత్తిగా నేర్చుకున్న చిత్రాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సులభంగా నేర్చుకోవాలనే సంకల్పంతో సొంత ఖర్చుతో పెయింట్స్‌ను కొనుగోలు చేసి చిత్రాలను వేస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలే కాకుండా తెలంగాణ తల్లి, హరితహారం, దేశ నాయకుల చిత్రాలు మహాత్మగాంధీ, అంబేడ్కర్, నెహ్రూ, కాళోజీ, గోరేటి వెంకన్న, రవీంద్రనాథ్‌ఠాగూర్, సర్వేపల్లి రాధాకృష్ణ, చిత్రాలకు తోడు షిర్డీ సాయిబాబా, శివుడు, వెంకటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య, గణపతి, రాధాకృష్ణ, లక్ష్మీదేవి చిత్రాలను చక్కగా వేశారు. దీంతో శ్రీనివాస్ ఏ పాఠశాలలో అడుగు పెట్టిన ఆ పాఠశాల రూపురేఖలు మారుతున్నాయి.

**ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికే**


ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసమే నేను ప్రవృత్తిగా నేర్చుకున్న పెయింటింగ్‌తో పాఠశాల తరగతి గదుల గోడలపై చిత్రాలు వేస్తున్నాను. నేను వేసిన చిత్రాలతో విద్యార్థులు చక్కగా నేర్చుకుంటూ జ్ఞాపకం ఉంచుకుంటున్నారు. అందువల్లే పని చేసే పాఠశాలలే కాకుండా ఎవరైనా సహచర ఉపాధ్యాయులు కోరితే ఆయా పాఠశాలల్లోనూ చిత్రాలు వేస్తున్నాను.

\- శ్రీనివాస్, చిత్రకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**చిత్రాలతో ఆహ్లాదకరంగా తరగతి గదులు**


విద్యార్థులకు ఉపయోగపడే చిత్రాలు వేయడం వల్ల తరగతి గదులు ఆహ్లాదకరంగా మారుతున్నాయి. మా పాఠశాలలో శ్రీనివాస్ వేసిన చిత్రాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించగల్గుతున్నాం.

\-నర్సింగ్, హెచ్ఎం, బొక్కస్‌గాం పాఠశాల, కల్హేర్ మండలం

### సృజనాత్మక, స్వతంత్ర ఆలోచనలే
### కొత్త వ్యాపార ఆవిష్కరణలకు నాంది

**స్టార్టప్ మెంటర్ అక్షయ్ దేశ్‌పాండే**

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచనలు ఉన్నవారే కొత్త వ్యాపార ఆవిష్కరణలకు నాంది పలుకుతారని ప్రముఖ స్టార్టప్ మెంటర్ అక్షయ్ దేశ్‌పాండే అన్నారు. విద్యార్థుల్లో వ్యాపార ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎంటర్‌పెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షయ్ దేశ్‌పాండే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలను అందించగలగడం ద్వారా విజయాన్ని సాధించవచ్చన్నారు. లింక్‌డ్ఇన్ వంటి వృత్తిపరమైన నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, ఈడీసీ సెల్ కో ఆర్డినేటర్ గురుచరణ్‌దాసు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 'వెల్‌నెస్'లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 'వెల్‌నెస్‌లో గడువు తీరిన ట్యాబ్లెట్లు' శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి తనిఖీ చేపట్టారు. వెల్‌నెస్ సెంటర్‌లోని ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, ఇన్-ఔట్ స్టాక్ పరిశీలించారు. పేషెంట్‌కు కాలం చెల్లిన మందులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది. గడువు ముగిసిన ట్యాబ్లెట్లు ఎందుకు ఇంకా స్టాక్ ఉంచుకున్నారనే విషయాలను ఫార్మసిస్టులను అడిగి తెలుసుకున్నారు. మందులు తీసుకున్న పేషెంట్ కుటుంబ సభ్యులను కూడా ఫోన్‌లో సంప్రదించి ఆరా తీశారు. వెల్‌నెస్‌లోని ఫార్మసీ నిబంధనల ప్రకారం నిర్వహణలో లోపం ఉన్నట్టు గుర్తించారు. తనిఖీలో పరిశీలించిన అంశాలను రిపోర్టు రూపంలో పేర్కొని డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు నివేదించనున్నట్టు రవికిరణ్‌రెడ్డి తెలిపారు.

### 'ఎస్‌హెచ్‌టీవో'కు ఆరోగ్య శాఖ వాహనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు ప్రభుత్వ వాహనాలను స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్(ఎస్‌హెచ్‌టీవో)కు తరలించే చర్యలు చేపట్టారు. 'వాహనాలకు తుప్పు.. ఎవరిదీ తప్పు?' అనే శీర్షికన ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు కాలం చెల్లిన వాహనాలను కండమేషన్(తుక్కు) కోసం హైదరాబాద్ అమీర్‌పేటలోని ఎస్‌హెచ్‌టీవో కార్యాలయానికి తరలించే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు.

## రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు

- గురుకుల విద్యార్థులకు 75 శాతం రిజర్వేషన్
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి

బెజ్జంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ ద్వారా తోటపల్లి శివారులో రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలగు వర్షిణి అన్నారు. బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామ శివారులో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం ఆమె స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అలుగు వర్షిణి మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్యనారాయణ చొరవతో పరిపాలన అనుమతులు పూర్తయ్యాయని, సుమారు 100 ఎకరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. గురుకుల విద్యాలయాల్లో చదివిన విద్యార్థులకు 75 రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, తదితరులు ఉన్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న అలుగు వర్షిణి, మనుచౌదరి

## ధాన్యం కొనుగోళ్లల్లో జాప్యం చేయొద్దు

- రాష్ట్ర కన్స్యూమర్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల

మెదక్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలని, ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని జిల్లా అధికారులను రాష్ట్ర కన్స్యూమర్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయ్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల ఆదేశించారు. మెదక్ మండలంలోని కొంటూరు, రాజ్‌పల్లి, బాలానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, లారీల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీఎం సివిల్ సప్లయ్ సురేష్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మేనేజర్ జగదీష్, డీసీవో కరుణాకర్, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.


ప్యాడీక్లీనర్‌ను పరిశీలిస్తున్న ప్రియాంక ఆల

### సంగారెడ్డి సెంట్రల్ జైలులో 30న ఐరన్ స్క్రాప్‌కు వేలం

కంది, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఐరన్ స్క్రాప్‌కు ఈనెల 30న వేలం నిర్వహించనున్నామని జైలర్ బి.సత్యం శుక్రవారం ఒక ప్రకటనలు తెలిపారు. జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులోని స్టీల్ ఫ్యాక్టరీలో ఐరన్ స్క్రాప్ వేలం పాటకు హాజరయ్యే వ్యాపారులు రూ.5 వేలు అదే రోజు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంలో స్క్రాప్‌ను దక్కించుకున్న వారు వెంటనే 18 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాలి. అలాగే రెండు రోజుల్లో పూర్తి డబ్బులను చెల్లించి స్క్రాప్‌ను జైలు నుంచి తరలించాలనే నిబంధనలు విధించారు. వేలం పాటలో పాల్గొని రూ.5 వేలు డిపాజిట్ చేసిన మిగతా వారికి వేలంపాట అయిపోగానే తిరిగి ఆ డబ్బు చెల్లిస్తామని జైలర్ సత్యం తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని కోరారు.

### జిన్నారం ఆందోళనల కేసులో 19 మంది అరెస్టు

జిన్నారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిన్నారంలో జరిగిన ఆందోళనలో పోలీసులు కేసు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేశారు. జిన్నారంలో శివుడి విగ్రహం ధ్వంసం, అనంతరం జరిగిన ఆందోళనలో పాల్గొన్న పలు గ్రామాలకు చెందిన 19 మందిని గుర్తించిన పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో మరికొందరిపైన పోలీసులు అభియోగాలు నమోదు చేశారు.


కోహెడలో చేతిపంపుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ శ్రీనివాసాచారి

## చేతిపంపు మెకానిక్‌లను పట్టించుకునే వారేరీ?

**చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు.. సకాలంలో అందక అవస్థలు**

అక్కన్నపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల నీటి అవసరాలను తీర్చే చేతిపంపు బోరు మెకానిక్‌లు చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నారు. కాస్త జీతం కూడా సకాలంలో అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న ప్రభుత్వం పర్మినెంట్ చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది బోరు మెకానిక్‌లు ఉండగా, సిద్దిపేట జిల్లాలో 20 మంది వరకు పని చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో గ్రామాలలో చేతి పంపుల మరమ్మతుకు 1983లో కాంట్రాక్టు పద్ధతిలో మెకానిక్లను నియమించారు. 1990వరకు ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోనే పనిచేశారు. అందులో పని చేసిన కొంతమంది మెకానిక్‌లు రెగ్యులర్ అయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వం వారిని మండల పరిషత్‌కు బదలాయించారు. కానీ, వారిని రెగ్యులర్ చేయలేదు. పంచాయతీరాజ్ శాఖకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకమైన మెకానిక్‌కు మస్టర్ పద్ధతిలో రూ.9 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ కొద్దిపాటి వేతనం కూడా సకాలంలో చెల్లించడం లేదు. సిద్దిపేట జిల్లాలో 6 నెలల నుంచి 15 నెలల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు ప్రతీ నెల సక్రమంగా చెల్లించి, రెగ్యులర్ చేసి ఆదుకోవాలని బోరు మెకానిక్‌లు కోరుతున్నారు.

**రెగ్యులర్ చేయాలి**


28 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ బోరింగ్ మెకానిక్‌గా పనిచేస్తున్న. చాలి చాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న. నాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేయలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బోరు మెకానిక్‌లను రెగ్యులర్ చేయాలి.

\- తాళ్లపల్లి కొమురయ్య, చేతి పంపు మెకానిక్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

**15 నెలలుగా జీతం రాలేదు**


15 నెలల నుంచి జీతం రాక పోవడంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న. జీతాలు రాకున్నా ప్రజలకు నీటి సౌకర్యం అందించాలని చేతి పంపులు చెడిపోతే గ్రామాల్లోకి వెళ్లి మరమ్మతులు చేస్తున్నాం. ప్రభుత్వం జీతాలు సక్రమంగా అందించి రెగ్యులర్ చేయాలి.

\- మిట్టపల్లి శ్రీనివాసాచారి, బోరింగ్ మెకానిక్, కోహెడ మండలం

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



సీపీఎం నాయకుల మద్దతు కోరుతూ వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

చేర్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమంకోసం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్ ఆధ్వర్యంలో దివ్యాంగులు మద్దతు కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆముదాలమల్లారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అంత్యోదయ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, రాజీవ్ యువవికాసంలో 5శాతం కేటాయించి రుణాలు అందించాలని, ఉపాధిహామీ పథకంలో 150రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో కొద్ది రోజులుగా ట్రాఫిక్ సీఐ మురళి సిబ్బందితో పలు కూడళ్లలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిని పట్టుకున్నారు. వారిని శుక్రవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపరచగా విచారణ చేసి వారకి రూ. 5,500 వేల రూపాయల జరిమాన విధించారు.

## రుతుక్రమ పరిశుభ్రతను పాటించాలి



విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న డా. శిరీష

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే బాలికలు రుతుక్రమ పరిశుభ్రతను పాటించేలా జాతీయ విధానాన్ని అవలంబించాలని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ జి శిరీష అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సంజీవని పారామెడికల్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రితిమతి అభియాన్‌లో రుతుక్రమ ఆరోగ్యం - పరిశుభ్రత దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పదవ తరగతి బాలికల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. నివృత్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జి శిరీష మాట్లాడుతూ రుతు చక్రం ప్రారంభమనేది స్త్రీలలో జీవ సంబంధమైన మార్పులలో ఒకటన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేయాలన్నారు. రుతుక్రమ సమయంలో బాలికలు యోగాసనాలతో పాటు పోషకాహారం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12 తరగతుల బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించాలన్నారు.

## మాజీ జడ్పీటీసీ రామచంద్రం మృతి



కన్నోజు రాంచంద్రం

హుస్నాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మాజీ జడ్పీటీసీ కన్నోజు రాంచంద్రం (65) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన రాంచంద్రం కరీంనగర్‌లో న్యాయవాద వృత్తి చేస్తూ 2001 బీఆర్ఎస్ నుంచి జడ్పీటీసీగా ఎన్నికై 2006 వరకు పని చేశారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం కరీంనగర్‌లో జరిగాయి. రామచంద్రం మృతి పట్ల హుస్నాబాద్ పట్టణంలోని పలువురు సంతాపం తెలిపారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

## రజతోత్సవ సభను సక్సెస్ చేద్దాం

గజ్వేల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభ ఏడాది కాంగ్రెస్ పాలనను ఎండగడించిందని అని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 24ఏళ్లు నిండి 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభను హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 27న గజ్వేల్ నియోజకవర్గం నుంచి 15వేల మందిని 280 బస్సుల ద్వారా తరలించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్నారని, ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు.

## మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సైగా నాగరాణి



సీఐని కలిసిన నాగరాణి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సైగా సూరగోని నాగరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాణి మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు.









## వినియోగంలోకి సులభ్ కాంప్లెక్స్‌లు

హుస్నాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపాలిటీలో అలంకార ప్రాయంగా సులభ్ కాంప్లెక్స్‌లు అనే శీర్షికన ఈ నెల 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సులభ్ కాంప్లెక్స్‌ల తాళాలు తీయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. పట్టణంలో నాలుగు చోట్ల సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం జరుగగా మూడింటిని వినియోగంలోకి తేవడంతో పాటు ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను దేవాలయ అధికారులే నిర్వాహణ బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

# భూభారతితో భూములకు రక్షణ

● ఆర్డీవో సదానందం



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో సదానందం

చేర్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల భూభారతి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం భూ భారతి చట్టంద్వారా రైతుల భూములకు పటిష్ట రక్షణ కల్పిస్తుందని సిద్దిపేట ఆర్డీవో సదానందం అన్నారు. చేర్యాల పట్టణంలోని రైతువేదికలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో సదానందం మాట్లాడారు. భూభారతి ద్వారా రైతుల భూములను సర్వే చేయించి హద్దులు నిర్ధారించి మ్యాప్‌తో సహా రిజిస్ట్రేషన్ సమయంలో అందించడం జరుగుతుందని తద్వారా కబ్జాకు అవకాశం ఉండబోదన్నారు. భూముల వివరాలను ఆనలైన్‌లో చూసుకోవచ్చని, భూ సమస్యలు వస్తే 90శాతంపైగా తహసీల్దారు వద్దే పరిష్కారమవుతాయన్నారు. లేనిపక్షంలో ఆర్డీవో, కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు.

# పహల్గాం మృతులకు నివాళి

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన దాడిలో చనిపోయిన వారికి పలు చోట్ల నివాళులర్పించారు. పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని భారతీయ ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తున్నట్లు గజ్వేల్ మసీద్ కమిటీ సదర్ సయ్యద్ మతిన్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో తంజీముల్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని మసీదుల్లో ముస్లింలందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనలో పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

### కుకునూరుపల్లి

కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్ర మూకల దాడిని నిరసిస్తూ గురువారం రాత్రి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ వద్ద మృతులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు

### సిద్దిపేట

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో బీఆర్ఎస్, టీఎన్‌జీవోస్, లాల్ కమాన్ వర్తక వ్యాపారుల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .ఇది కేవలం 26 మందిపై జరిగిన దాడి కాదని పూర్తిగా దేశంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ పై చర్యలకు ఉపక్రమించి, సర్జికల్ స్ట్రైట్ లాంటి చర్యలు తీసుకొని ఉగ్రవాదులను మట్టుబెట్టాలని డిమాండ్ చేశారు.



మృతులకు నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



లాల్‌కమాన్ వర్తక వ్యాపారుల ఆధ్వర్యంలో కొవొత్తుల ర్యాలీ'



చెట్లు, బిల్డింగ్‌ల నీడలో వాహనాలను పార్కు చేసిన వాహనాదారులు

**వృక్షమే రక్ష**

ఎండ వేడి రోజు రోజుకు పెరుగుతుండడంతో వాహనదారులు తమ వాహనాలు ఎండకు మాడిపోకుండా నానా తంటాలు పడుతున్నారు. తమ వాహనాలను చెట్ల నీడలో భవనాల నీడలో నిలుపుతూ ఎండ నుంచి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

కుకునూరుపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు బోగి సాయికుమార్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పాల్గొని మాట్లాడుతూ మోదీ బీజేపీ ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, వెంటనే వాటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మతోన్మాద పార్టీ బీజేపీ ప్రజలను మభ్యపెడుతూ కార్మికులను కష్టాలకు గురిచేసే కార్పొరేట్లకు కొమ్ము కాస్తుందన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

చేగుంట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడియారం శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. చేగుంట ఎస్ఐ చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వడియారం గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై సులభ్ కాంప్లెక్స్ సమీపంలో వ్యక్తి సుమారు 30 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు గోధుమ రంగు ఫుల్‌షర్ట్ బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సాఫీగా ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తెలంగాణ సివిల్ సప్లయి చీఫ్ రైజనింగ్ ఆఫీసర్ ఫణిందర్ రెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించిన పంట కొనుగోలు సాఫీగా జరుగుతుందని తెలంగాణ సివిల్ సప్లయి చీఫ్ రైజనింగ్ ఆఫీసర్ ఫణిందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం ముండ్రాయి, పాలమాకుల ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయిస్ కమీషనర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, అడిషనల్ పీడీ మధుసూదన్, డీఎస్‌ఓ తనుంజా, డీఎం ప్రవీణ్‌లతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల ద్వారా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఐకేపీ అధికారులను, సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు అయ్యాయని తెలిపారు.

## పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

తొగుట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం గుడికందుల గ్రామంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మమ్మల్ని సల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుని ఆయన మాట్లాడారు. గ్రామ దేవతలతో గ్రామస్తులకు విడదీయరాని అనుబంధం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## కార్మికుల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దరిపల్లి చంద్రం

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కార్మికుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం (బీఎస్ఆర్‌కేఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం అన్నారు. శుక్రవారం హైదరబాద్‌లో మేడే సందర్భంగా కార్మికులతో కలిసి కొండ భూదేవి గార్డెన్‌లో నిర్వహిస్తున్న సభకు ముఖ్య అతిధిగా రావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మేడే సభకు రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని తెలిపారు. కావున అధిక సంఖ్యలో కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మికుల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు.

## బాల సంస్కార్‌లో వేసవి శిబిరం



బాల సంస్కార్ వేసవి శిక్షణకు హాజరైన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట షిరిడి సాయిబాబా గుడి డైనింగ్ హాల్లో శుక్రవారం బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వ్యాస మహర్షి యోగ సెంటర్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన శిక్షణ శిబిరంలో సిద్దిపేటతో పాటు వివిధ నగర, పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ బొమ్మలు, కొత్త దుస్తులు, ఆస్తులు కన్న పిల్లలకు మంచి శిక్షణ ఇవ్వడం గొప్ప బహుమతి అన్నారు. వ్యాస మహర్షి యోగ సెంటర్ డైరెక్టర్ తోట సంధ్య మాట్లాడుతూ బాల సంస్కార్ శిక్షణ శిబిరంలో యోగా, అబాకస్, శ్లోకాలు, భగవద్గీత, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఇండోర్ గేమ్స్, డాన్స్, భారతీయ సంస్కృతి, పండుగలు, ఆరోగ్యకర అలవాట్లు తదితర అంశాలపై నిపుణులైన శిక్షకులచే పిల్లలకు శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు, యోగా సెంటర్ ప్రతినిధులు చారి, బసవరాజు రాజ్ కుమార్, సింధూరి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 40 శాతానికి పైగా చెత్త విభజన

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపాలిటీలో 40 శాతానికి పైగా చెత్త విభజన జరుగుతుందని కమిషనర్ మల్లిఖార్జున్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని రావూస్ కాలనీలో తడి చెత్త, పొడి చెత్తపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణ ప్రజలకు చెత్త విభజనపై అవగాహన కల్పించడానికి నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రతి రోజు ఒక్కో టీమ్ సుమారు 25 నుంచి 30 ఇళ్లకు తిరిగి చెత్త విభజనపై అవగాహన కల్పిస్తారన్నారు.

## బీమా ఏదీ ధీమా?

5వ పేజీ తరువాయి

సభ్యులకు గానూ ఇద్దరికి చెల్లించగా మరో ఇద్దరి బీమా డబ్బును పెండింగ్‌లో ఉంచారు.

### సమన్వయం లేని స్త్రీనిధి, సెర్ప్ ఉద్యోగులు

జిల్లాలోని సెర్ప్‌లో ఏపీవోలు, సీసీలు, ఏపీడీ, డీపీఎం కలిపి 163 మంది సిబ్బంది ఉన్నారు. మెప్మాలో ఎఆల్ఎఫ్, ఆర్పీలు, టీఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ ఆర్పీలు 288 మంది ఉన్నారు. స్త్రీనిధి కింద రిజర్వ్ మేనేజర్‌తో పాటు ఆరుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. స్త్రీనిధి ఉద్యోగులు సభ్యుల మరణానికి సంబంధించి మరణంపై విచారణ జరిపి అందుకు కావాల్సిన పత్రాలను సెర్ప్ ఉద్యోగులకు అందిస్తే వారి లాగిన్‌లో బీమాకు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. లాగిన్ చేసి గ్రూపు పేరుతో పాటు మరణ ధ్రువీకరణ పత్రం, సంఘం తీర్మాన కాపీ, ఎఫ్ఐఆర్ కాపీ, నామిని పత్రాలు తదితర వాటిని అప్‌లోడ్ చేయాలి. ఉద్యోగుల సమన్వయ లోపం కారణంగా వాటి ప్రక్రియ సరిగా జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెర్ప్ ఉద్యోగులు చేయాల్సిన పనిని, స్త్రీ నిధి సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ వీరి మీదనే భారం వేస్తూ సెర్ప్ ఉద్యోగులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు కల్పించుకుని సమన్వయంతో పనిచేసేలా చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మేడేను జయప్రదం చేయండి

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మరాటీ కృష్ణమూర్తిలు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1886లో కాగో నగరంకు చెందిన రక్తం నుంచి పుట్టిన జెండా ఎర్ర జెండా అని నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా మే 1న కార్మికుల దీక్ష దినంగా భావించి ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు జెండాలు ఆవిష్కరించడం, హక్కుల కోసం ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్మిక వర్గంపై రోజు రోజు నిర్బంధం పెరుగుతుందని ఐక్యమై తిరిగి కొట్టాలని అన్నారు.

## కన్నులపండుగగా వేంకటేశ్వర కల్యాణం

● పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్ రావు



హరీశ్ రావును సన్మానం చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

నంగునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాలమాకులలోని వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న 13వ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా పద్మావతి, సమేత వెంకటేశ్వర స్వామి గారి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి కల్యాణం సందర్భంగా మాజీ మంత్రి ,సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు సన్మానం చేశారు.

## ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు అని శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని ప్రజ్ఞాపూర్ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బల్వీర్ సింగ్ మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా లాంటి వ్యాధులు సంక్రమిస్తాయని సమాజంలో ప్రతి ఒక్కరు వారి ఇంటి వద్ద నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

## పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

చిన్నకోడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సూరగొని శేఖర్ గౌడ్ అధ్యక్షతన గురువారం రాత్రి చిన్నకోడూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురుంచి గ్రామాల్లో ప్రజలకు వివరించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలను గెలుచుకునే విధంగా కృషి చేయాలని సూచించారు.

## కేధార్‌నాథ్‌కు వెళ్లిన సరుకుల లారీలు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్ర్యజ్యోతి ): కేదార్‌నాథ్ యాత్రికులకు నిత్యాన్నదాన వితరణ కోసం సరుకుల లారీలు సిద్దిపేట నుంచి శుక్రవారం వెళ్లాయి. ఈ సందర్భంగా శుక్రవారం కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట శ్రీ శరభేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం సోన్ ప్రయాగ్‌కు వెళ్తున్న ఆహార సరుకుల లారీలకు పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు రాధకృష్ణ శర్మ, కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి అయిత రత్నాకర్, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పిఆర్‌వో మంకాల నవీన్ కుమార్, సేవా సమితి సభ్యులు పాల్గొని సరుకుల వాహనాలకు జెండా ఊపారు.